


# స్నేహానికి చివరి మజిలీ...

సుస్మితా రమణమూర్తి

ఆఫీసులో వోవర్‌టైమ్—అంటూ లేకుంటే ఇంచుమించు ప్రతి సాయంత్రం బీచ్‌లో కూర్చుని పొంగులు కక్కే కెరటాన్నీ నింగీ—సముద్రం కల్సినట్లు కన్పించే గీతవేపు చూస్తూ నా ఆలోచనలకో రూపాన్ని ఆపాదించుకోడంకోసం కొన్ని గంటల్ని సునాయాసంగా ముందుకి దొర్లించేయడం చాలాకాలంనుంచీ నాకున్న అలవాటు. ఈమధ్య ఆఫీసులో అట్టే పనుండటం లేదు.

ప్రతి సాయంత్రం నాకు తీరుబడే.

సుమారు పదిరోజులనుండి నాలో సుళ్ళు తిరుగుతున్న భావాలు కథగా రూపు దిద్దుకోవడం లేదు.

ఇప్పటివరకూ ఎన్నో కథలు సునాయాసంగానే రాసేశాను. ఇన్నిరోజులు ఏ కథ గురించీ ఇంత తర్జన భర్జన చేయలేదు. నా ఆలోచనలు—భావాలు ఒక కొలిక్కి రాకముందే ఏదోలా కథ రాసేయడం నా అభిమతం కాదు కాబట్టి ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాను.

''హాల్లో, సుధా!'' అన్న తీయని పిలుపు నా ఆలోచనల్ని చెదరగొట్టింది—ఎదురుగుండా నవ్వుతూ—మరికొళుందు పరిమళాన్ని విరజిమ్ముతూ పరిమళ!

ఆశ్చర్యంతో రెప్పలాడిస్తూ ఇంతింత కళ్ళతో నవ్వుతూ నా ముఖంలోకి సూటిగా చూస్తోంది.

అనుకోకుండా—ఆకస్మాత్తుగా పరిమళ దర్శనం కావడంతో కొన్ని క్షణాలు ఆశ్చర్యంతో కొట్టుకు పోయి పలకరించడమే మరిచాను.

''ఏమండోయ్, కవిగారూ! కాసేపు మన లోకం లోకి దిగివస్తారా?''—అదోలా నవ్వుతూ—నా భుజాల్ని వూపుతూ అంది తను.

ఆమె స్పర్శతో—''ఏమిటి!?....ఈ అకాల దర్శనం!?'' పరిమళ ముఖంలోకి చూస్తూ అడిగాను

తను నా ప్రక్క కూర్చుంది.

నా ప్రశ్నకు—ఆశ్చర్యానికి ఒక చిర్నవ్వే సమాధానమైంది.

నా చేతిలోంచి ఆవారం పత్రిక తీసుకుని పేజీలు తిరగవేయసాగింది. ఒక పేజీలో తన చూపులు చిక్కుకున్నాయ్.

''సుధా! ఒక అయిదు నిముషాలు నన్ను డిస్టర్బ్ చేయకు. నా అభిమాన రచయిత కథొకటి ఇందులో ఉంది. వెంటనే చదివేయాలి!'' అంటూ కథ చదవడంలో లీనమైపోయింది తను. పరిమళ చదువుతున్న కథ నా కలంనుంచి వూపిరి పోసుకుందే! పరిమళకున్న ఆ కథల పిచ్చి మూలంగానే తను నా అభిమానిగా మారిపోయింది. మూడేళ్ళ క్రితం మా పరిచయం విచిత్రంగా జరిగింది.

నా మిత్రుడు రాజారావు చెల్లెలు సుమిత్ర.

సుమిత్ర, పరిమళ మంచి స్నేహితులు.

ఒక రోజు సుమిత్ర—పరిమళ బీచ్‌లో నడుచు కుంటూ ఒక పత్రికలో పడ్డ నా కథ గురించి మాట్లాడుకుంటూ పోతున్నారు.

నేను కుతూహలంగా, ఆసక్తిగా వాళ్ళను అనుసరించాను. వాళ్ళు నన్ను గమనించలేదు.

సుమిత్రకు మొదటినుంచీ నా కథలమీద మంచి అభిప్రాయం లేనేలేదు. అందుకే అప్పుడు కూడా నా కథ గురించి తేలిగ్గా మాట్లాడింది.

పరిమళమాత్రం అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. వాళ్ళమాటల్నిబట్టి పరిమళకి నా రచనలంటే ఎంతో ఇష్టమన్న విషయం స్పష్టమైంది. ఆ తర్వాత సుమిత్ర ఇంట్లోనే పరిమళతో నాకు పరిచయం కలిగింది.

నా రచనల్ని అభిమానించే ఒక పాఠకురాలితో ముఖాముఖి మాట్లాడగలిగే అవకాశం లభించినందుకు సంతోషించాను. పరిమళమాత్రం నాతో పరిచయం కలిగినందుకు నాకంటే ఎంతో సంతోషించిందన్న విషయం తన ముఖంలోని భావ ప్రకటన ద్వారా గ్రహించాను.

అలా ఏర్పడిన మా పరిచయం బాగా వృద్ధి చెందింది. వారంలో కనీసం ఒక మూడు సాయంత్రాలైనా బీచ్‌లో నాతో గడిపేది తను.

కథలు రాసేవాళ్ళు తన దృష్టిలో ఉత్తమ పురుషులు!... ప్రత్యేక కోవకి చెందినవాళ్ళు!...

తన కెప్పుడూ కథలు—కథలు రాసేవాళ్ళ ధ్యాసే!

నే రాయబోయే ప్రతి కథా తనకు ముందు చెప్పేవాణ్ణి.

అప్పుడప్పుడు తన సలహాలు నాకు ఉపయోగపడేవి.

తదనుగుణంగా కథల్ని రాస్తుండేవాణ్ణి. నే రాసే ప్రతి కథకూ మొదటి పాఠకురాలు తనే అయేది. అప్పుడప్పుడు సినిమాలు కలిసే చూసేవాళ్ళం.

నా గదికి వచ్చి గంటల తరబడి సాహిత్యం గురించి తన అభిప్రాయాల్ని వెలిబుచ్చేది. తను మంచి సాహితీ ప్రియురాలు. తనలా మాట్లాడుతున్నంత సేపూ ఎంతో తన్మయత్వంగా తన కళ్ళలోకి చూస్తూ ఉండటం తప్ప తన వాక్ప్రవాహానికి ఆనకట్ట వేయలేకపోయేవాణ్ణి.


కారణం—తనలా అనాయాసంగా — స్వేచ్ఛగా స్వచ్ఛంగా మాట్లాడుతుంటే మంత్రముగ్ధుని— వినడం నాకెంతో ఇష్టం! అంత సన్నిహితంగా మసలిన పరిమళ అనుకోకుండా కన్పించడం మానేసింది. కొన్నాళ్ళు కారణం తెలియక కొట్టుమిట్టులాడాను. ఉండలేక సుమిత్రను అడిగితే హైద్రాబాద్‌లో ఉద్యోగం వచ్చిందని తెలిసింది.

తనకు అంత ఉద్యోగం చేయాల్సిన అవసరమేమిటో అర్థం చేసుకోడానికి తన కుటుంబ విషయాలేవీ నా కంతగా తెలీవు. వెళ్ళేముందు నాతో ఒకమాట చెప్పివెడితే ఎంత బావుండేదని వాపోయాను.

అప్పుడప్పుడు ఫలానా కథ చదివాను. చాలా బాగుంది సుధా! మరిన్ని మంచి కథల చదివే భాగ్యం నాలాంటి పాఠకులకు కలిగించు— అంటూ ఉత్తరాలు రాస్తుండేది.

ఈమధ్య అవీ కరువైపోయాయ్.

ఆ తర్వాత అనుకోకుండా ఇలా పరిమళ నా ముందు ప్రత్యక్షం కావడంతో కొన్ని క్షణాలు నన్ను నేనే నమ్మలేకపోయాను. పెళ్ళయిం తర్వాత కూడా నా పరిమళ నాలాంటి బ్రహ్మచారితో అంత ఫ్రీగా మాట్లాడుతుండటం నాలోని ఆశ్చర్యానికి మరో కారణం! క్రిందటేడు తన పెళ్ళి హైదరాబాద్‌లోనే జరిగిపోయింది. ఆఫీసు పనుల ఒత్తిడి మూలంగా తన పెళ్ళికి వెళ్ళలేకపోయాను.



అప్పటికీ, ఇప్పటికీ పరిమళలో నే గమనించిన మార్పు ఒక్కటే! అప్పటి పరిమళ నాజూగ్గా సన్నగా ఉండేది.

ఇప్పటి పరిమళ కాస్త ఒళ్ళు చేసి నిండుగా ఉంది. హుందాగా ఉంది. మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది

“శ్రీవారి సంగతులేమీ లేవా?” తెల్సుకోవాలన్న ఆసక్తి లేకపోయినా ఏదో మాట్లాడాలి కదాని అడిగాను

“లేకేం? ... వారింకా హైదరాబాద్‌లోనే ఉద్యోగం చేస్తున్నారు. ఒక అర్నెల్లల్లో తనక్కూడా నాలాగే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అవుతుందట అంతదాకా వారక్కడ! నే నిక్కడ!” నవ్వేస్తూ చెప్పింది తను.

పరిమళంటే ఇప్పటికీ నా కిష్టమే!

నాతో చనువుగా ఉంటుంది.

ఆత్మీయత ఉట్టిపడేలా మాట్లాడుతుంది.

అప్పుడు కావాలనుకుంటే తనను నా దానిగా చేసుకునేవాణ్ణి?

అయితే తనలోని ఒకగుణం నాకు నచ్చలేదు.

అందుకే పెళ్ళికి వెనుకంజ వేశాను.

తను అందరితోనూ ఎంతో చనువుగా ఉంటుంది. విపరీతంగా నవ్వుతూ మాట్లాడుతుంది. ప్రతి విషయాన్ని ఈజీగా తీసుకుంటుంది. ఆ అలవాటే నాకు అంతగా నచ్చలేదు. కానీ...తన నవ్వే నన్నింకా ఆకర్షిస్తోంది. నవ్వుతున్నప్పుడు ఆ మెరిసే కళ్ళు నన్నింకా కట్టి పడేస్తున్నాయ్.

ఆ సుస్మిత వదనారవిందమే నాలో ఇంకా ఏవేవో భావాలకి గురి చేస్తోంది.

తనలా చనువుగా—ఆత్మీయంగా మాట్లాడ్డం వల్లే తన గురించే ఆలోచించేలా చేస్తోంది.

పరిమళను వదులుకున్నందుకు అంతరంగంలో ఏదోలా ఉందిప్పుడు.

“హో కవిరాజా! ఈరోజు నీ దృష్టి క్కడ లేనట్టుంది. ఇంతకీ రేపు సాయంత్రం ఇంటి దగ్గరుంటావా? నీతో అర్జంటు పనోటుంది” నవ్వుతూ అడిగింది.

“సాయంత్రాలు నాకేం పనుంటుంది? ఆఫీసులో పని కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది. నీవు వస్తానంటే మధ్యాహ్నంనుంచీ ఇంటి దగ్గరే ఉంటాను. ఇంతకీ అంత అర్జంటు పనేమిటి!..” ఆశ్చర్యంగా అడిగాను.

“ఇప్పుడే చెబ్దామనుకున్నాను. నీవు మూడ్‌లో లేవు. బుద్ధిగా నీ కథల లోకంలో ఇవేళ్టికి విహరించు. రేపు సాయంత్రం మాట్లాడుకుందాం.”

నా ఆలోచనల్లో ‘రేపు సాయంత్రం’ చాలా సీరియస్‌గా స్థానం వేసుక్కూర్చుంది.

బస్టాప్‌లో వున్నాదల్లా తనక్కావాల్సిన బస్సు రావడంతో ‘గుడ్‌నైట్! స్వీట్ డ్రీమ్స్!’ చెప్పి వెళ్ళిపోయింది.

ఆఫీసుకి వెళ్ళానన్న మాటేగాని ఆ మర్నాడంతా పరిమళ గురించిన ఆలోచనలే!

ఎంత వేగంగా సాయంత్రం అవుతుందా? ఎప్పుడు పరిమళ నా దగ్గరకు వస్తుందా?—అన్న ధ్యాసతోనే ఉన్నాను.

చినుకులు పడుతున్నా చెప్పినట్లే తనొచ్చింది. అయితే చాలా ఆలస్యంగా వచ్చింది.

తను రాబోయేసరికి ఏడుగంటలు కావస్తోంది. అంతవరకు తన గురించి నిరీక్షించడం మూలంగా నాలో చోటు చేసుకున్న నీరసం—నిస్తేజం తను రావడంతో పటాపంచలైపోయాయ్.

వచ్చిందగ్గర్నుంచీ ఇదివర్లాగే కథల గురించి— సినిమాల గురించి గడగడా మాట్లాడ్డం—అప్పుడప్పుడు నా అభిప్రాయాల్ని వెలిబుచ్చడంలో ఒక అరగంట ముందుకి జరిగిపోయింది. ఎనిమిది గంటలకు నా సర్వెంట్ హోటల్నుంచి కారేజ్ తీసుకొచ్చాడు.

కారేజిని చూస్తూ—ఒక ప్రక్క నవ్వుతూ ఒక సలహా పారేసింది.

“ఎన్నాళ్ళింకా ఈ హోటల్ మెతుకులు? శుభ్రంగా నాలాంటి దాన్నెవరినైనా పెళ్ళి చేసుకో

నాయనా?'' అని.

"ఎందుకన్నాడనా? అన్న నీలాంటి ఆనన్నాను దొరకాలికదా? అంతవాకా ఇలా గడుపక తప్పదు." కారేజీ విప్పి రెండు ప్లేట్లలో భోజనం సర్దుతూ అన్నాను.

"రెండో ప్లేటెవరికి?" ఆశ్చర్యంగా అడిగింది తను.

"ఇంకెవరికి నీకే!" నవ్వుతూ అన్నాను.

అభ్యంతరం చెప్పలేదు తను.

ఎంతో కలుపుగోలుగా—భార్యా భర్తల్లా కబుర్లు చెప్పుకుంటూ భోజనం కానిచ్చాం.

మరో అరగంట ముందుకి దొర్లిపోయింది. అప్పటికీ పరిమళ తనొచ్చిన పని గురించి ప్రస్తావించ లేదు.

"భోజనం అయ్యింతర్వాత కాసేపు పడుం వాల్చడం నాకు అలవాటు బాబూ!" అంటూ నా మంచంమీద పడుకుంది.

పరిమళ ప్రవర్తన వింతగా ఉంది.

తన ఆంతర్యం ఏమిటో అంతు చిక్కటంలేదు.

జంకూ—గొంకూ—భయంలేకుండా ఒక పరాయి మగాడి గదిలో అందునా రాత్రిపూట నిశ్చింతగా పడుకోటంలో తనెలా అర్థం చేసుకోవాలో అర్థం కావటంలేదు.

'ఇలాంటప్పుడు ఎవరైనా వస్తే?'— అన్న సంకోచం ఒకవేపు నన్ను తినేస్తోంది.

ఆడదై ఉండీ—ఏమాత్రం అనుమానంలేకుండా తనెలా ఉండగలుగుతుందో !?....

తనకు నామీద 'ఆ అభిప్రాయం' ఉందేమో?... అందుకే ఇలా వచ్చిందేమో?....

నన్ను రెచ్చగొట్టడానికే ఇలా ప్రవర్తిస్తుందేమో?... నా ఆలోచనలు నాకే ఆశ్చర్యంగా ఉన్నాయ్, వింతగా ఉన్నాయ్.

నా ఈ ఆలోచనల ధోరణికి పరిమళ వింత ప్రవర్తనే కారణంకాదూ?....

ఒక అయిదు నిముషాలు ముందుకి గడిచాయ్.

పరిమళ నిజంగానే నిద్రపోతున్నట్లుంది.

ఉన్నట్లుండి కరెంట్ పోయింది.

బయట ఇంకా చినుకులు పడుతూనే ఉన్నాయ్.

చలిగాలి వీస్తోంది. క్రొవ్వొత్తి వెలిగించి టేబులు మీద ఉంచాను.

చుట్టూ చీకటి! నిశ్శబ్దం!!

ఆ చీకట్లో నేనూ—పరిమళ!!!...

మనసులో భావాల అలజడి.

ఏదో తెలియని ఆందోళన!!

ఆ దేహంపైకి కోరికల గజిబిజి!

భయంకరమైన కోరికలు నరనరాల్నీ కోసేస్తోంది.

గుండెలో ఏదో తెలియని దడ దడ! దడదడ!...

అంత చలిలో కూడా ఒళ్ళంతా వేడెక్కిపోయిందా!?

ఇన్నేళ్ళ జీవితంలో ఇలాంటి అనుభవం మొదటిసారి కావడంలో భయం భయంగా ఉంది. వింతగా ఉంది. అవకాశాన్ని జారవిడుచుకోవద్దంటూంది మనస్సు.

'తప్పుకునా!' వివేకం ఒకవేపు హెచ్చరిస్తోంది. ఆమె దగ్గరకు వెళ్ళి మంచంమీద బొమ్మని కొన్ని క్షణాలు అలాగే చూస్తూ నిలబడిపోయాను. ఏమిటో కంట్రోల్ చేసుకోలేక తన అధరాల్ని ముద్దాడి లేకుండా ఉండలేకపోయాను.

దిగ్గున లేచింది పరిమళ.

పరిస్థితిని అర్థం చేసుకుంది.

నా గుండె కొట్టుకోవడం ఇంకా తీవ్రమైపోతోంది.

ఆమె పడుకుంటున్నట్టే మెల్లగా వేస్తూ తన్మయత్వంతో తేలిపోతూ—'పరిమళా!' అన్నాను — ప్రేమ, అనురాగం మిళితమైన స్వరంతో.

"అరే!! కరెంటెప్పుడు పోయింది!?....' ఆశ్చర్యపోతూ మంచంమీదించి లేచింది తను.

నా పరిస్థితిలో మార్పేమీ లేదు.

వెర్రిగా—ఆశగా—కాంక్షగా ఇంకా తనవేపే చూస్తున్నాను.

"సుందర్! నీవు మామూలు మనిషివి కావు. రచయితవి! ఎన్నో పుస్తకాల్ని — జీవితాల్ని చదివిన వాడివి! నీ రచనల ద్వారా సమాజానికి పనికి వచ్చే సందేశాలు ఇస్తున్నవాడివి!...... అలాంటి ఉన్నతుండవై యుండీ కూడా ఇలా క్షణికోద్రేకానికి లొంగిపోయి మామూలు మనిషిలా ప్రవర్తిస్తావని నేను కల్లో కూడా అనుకోలేదు. పెళ్ళయిన ఆడదానికి నీవిచ్చే గౌరవం ఇదా?—అని నిన్ను నిలదీయను. కారణం—కొండంత నమ్మకం నీపై నాకు ఉండటంవల్లే ఇప్పటికీ నీ పట్ల ఎంతో గౌరవంగా ఉంటున్నాను. ఇప్పటికీ నీ రచనలన్నా—నీవన్నా నాకు అభిమానమే! ఆ అభిమానమే— నీపట్ల నాకున్న ఆ నమ్మకమే ఇంత రాత్రి అయినా నీ దగ్గర ఉండిపోయేట్టు చేసింది. ఈ నా ప్రవర్తన నీలో ఆశ్చర్యాన్ని—మనసులో అలజడిని రేకెత్తించి ఉండొచ్చు. అలా నిన్ను క్షణికోద్రేకానికి లోను చేసింది నా ప్రవర్తనే కావచ్చు. అయామ్ వెరీసారీ ఫర్ దట్!....ఇక్కడిలా మగవాళ్ళు సింపతీతో ఉండటంలేదు. ఈ కీడి వికాసాల్లోనే ఉంటున్నారు అందుకనే చాలా ఆలస్యంగా ఇక్కడికి వచ్చినా— ఇంత రాత్రి అయినా ఇక్కడున్నంటి వెళ్ళలేదు నేను."

ఆయాసం తీర్చుకోడానికి ఆగింది తను.

ఇలా ప్రతి ఇలా అయింది నా పరిస్థితి.

"సుందర్! చాలామంది అనుకుంటున్నట్లు— స్నేహిస్తున్నట్లు యువతీ—యువకుల మధ్య ఉండే స్నేహానికి చివరి మజిలీ శారీరక సంబంధం కానక్కర్లేదు. మన స్నేహానికి నిర్వచనం— పరమార్థం—అదేనని నీవు కూడా అలి పొరపాటు పడితే నీ విషయంలో నా ఆలోచనలు దోషం— అంటవా తప్పే అవుతుంది. సర్లే జరిగిందేదో జరిగిపోయింది. ఇంతవరకూ నీకు అసలు విషయం చెప్పనేలేదుకదూ?..."

చెప్పలేదన్నట్లు తలూగించాను.

"అన్నం వాళ్ళగే ఉంటుంది మా చెల్లాయ్. మా పెదనాన్న కూతురనుకో! దాని పెళ్ళికి మావాళ్ళు తొందరపడుతున్నారు. నీవు చేసుకుంటావేమోనని అడగడానికే వచ్చాను. వివరాలు చెప్పడానికి నాకు మూడ్ లేకున్నాదు. అన్ని విషయాలు రేపు మాట్లాడుకుందాం. గుడ్‌నైట్! స్వీట్ డ్రీమ్స్" అంటూ పరిమళ చిక్కటి చీకట్లోంచి కాంతి పుంజంలా కదిలిపోయింది.

పరిమళ వెళ్తున్నవేపు నమ్మలేనట్లుగా ఉలుకు పలుకు లేకుండా చూస్తుండిపోయాను. *

